# డీజీపీని కలిసిన డీఎస్పీ శ్రీనివాస్



పరిగి, నవంబర్ 4 : పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందిన ఎన్.శ్రీనివాస్ సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేశారు.

## సన్మానాలు..



కులకచర్ల, నవంబర్ 4: చౌడాపూర్ మండల కేంద్రంలోని చౌడాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని అక్షర కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనందుకు మండల నాయకులు విద్యార్థిని ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, పాఠశాల చైర్మన్ అలవేలు, నాయకులు సలీమ్, వెంకటేశ్, రాము, రాజు, మణికంఠ, గోపాల్, బాల్‌రాజ్, ప్రభు పాల్గొన్నారు.



కొడంగల్, నవంబర్ 4: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి వీరేశ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినందున వీరేశ్‌ను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సోమవారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, ఎంఈవో రాంరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం మురళీధర్‌లతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల, నవంబర్ 4 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన కులకచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు నూతనంగా కులకచర్ల మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా 1996-98 ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థులు ముజాహిద్‌పూర్‌లో వ్యవసాయ క్షేత్రంలో సన్మానించారు. కార్యక్ర మంలో ముఖ్యఅతిథి పండరినాథ్, పూర్వ విద్యార్థులు ఉస్మానలీ, మోహన్, జమీల్, వీరారెడ్డి, కృష్ణయ్య, సాయిలయ, సతీశ్, కట్టా వెంకటేశ్, పెంటయ్య, శ్రీనివాస్, గౌస్, వెంకటేశ్, సిద్ధు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



కొడంగల్, నవంబర్ 4: దుద్యాల మండలంలోని ఆలేడ్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన సిద్ధుమల్లేశ్, బదిలీపై వెళుతున్న సందర్భంగా సోమవారం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చూపిన ప్రేమ, గౌరవానికి తన గుర్తుగా ప్లేట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

## కేజీబీవీ విద్యార్థులకు వైద్య పరీక్షలు..



కులకచర్ల, నవంబర్ 4 : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 6,7 వ తరగతి అమ్మాయిలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ఎస్‌వో దేవి తెలిపారు. కేంద్ర వైద్యశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బాలికల్లో రక్తహీనతపైన అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, కేజీబీవీ పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దోమ, నవంబర్ 4 :మండల పరిధిలోని లింగనపల్లి గ్రామం నుంచి దోమ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పాఠ శాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, ఆసుపత్రికి వెళ్లే బాలింతలు అవస్థలు పడుతున్నారని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. సోమవారం తన సొంత ఖర్చుతో గుంతలను పూడ్చి రోడ్డు చదును చేయించారు.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### పాల్గొన్న ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి



*పరిగి: రూప్‌ఖాన్‌పేట్ సమీపంలోని కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి*



*పెద్దేముల్ : మంబాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి*

పరిగి, నవంబర్ 4 ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహ న్‌రెడ్డి సూచించారు. సోమవారం పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్ సమీ పంలో గల కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన ప్రతి చోట ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదన్నారు. రైతులు పండించిన పంటలు కొనుగోలు చేసేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటుచేసి సకాలంలో రైతులకు డబ్బులు అందేలా సర్కారు చర్యలు తీసుకుం టున్నదన్నారు. అంతకుముందు ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో డైట్, కాస్మొటిక్ చార్జీలు 40శాతం పెంచిన సందర్భంగా మండలంలోని సయ్యద్‌మల్కాపూర్ గ్రామ సమీపంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు స్టేషనరీ అందించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు లాల్ కృష్ణప్రసాద్, సత్యనారాయణ, వెంకటయ్య, చిన్న నర్సింహులు పాల్గొన్నారు.

**పెద్దేముల్:** రైతులు దళారులను నమ్మి మోసపోద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని, పత్తిని విక్రయించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మంబాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని, మారేపల్లి సుమిత్రా కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులు ప్రభుత్వ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ తమ పంటలను మద్దతు ధరలకు విక్రయించుకోవాలని సూచించారు.

**యాలాల:** రైతులకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాలలో పాలు పంచుకుంటున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పగిడ్యాల్ గ్రామంలో పీఏసీఎస్, రాస్నం గ్రామంలో డీసీఎమ్ఎస్, మండల కేంద్రంలో ఐకేపీ, బెన్నూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మద్దతు ధరతో పాటు సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరణం పురుశోత్తమరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, అమృతప్ప, చంద్రశేఖర్‌గౌడ్, హనుమంతు, మహిపాల్ పాల్గొన్నారు.

**కొడంగల్:** ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాని అమ్ముకోవాలని ఏపీసీఎస్ అధ్యక్షులు కటకం శివకుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, తహసీల్దార్ శివకమార్ పేర్కొ న్నారు. సోమవారం మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో పౌర సరఫరా సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకో వా లని, సరైన తూకంతో పాటు నగదు భరోసా ఉంటుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి 2320, బీ గ్రేడు రకానికి 2300లు ధరను ప్రభుత్వం నిర్ణయిం చినట్లు తెలిపారు. తేమ శాతం తక్కువగా ఉండటంతో పాటు ధాన్యం శుభ్రంగా ఉండే విధంగా రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎంకన్న, గ్రామస్తులు బస్వరాజ్ పాల్గొన్నారు.



*కొడంగల్: అప్పాయిపల్లి గ్రామంలో..*

# ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం

తాండూరు, నవంబర్ 4 : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నాలుగు దశల్లో ఈ సర్వేను పూర్తి చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న తెలిపారు. సోమవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్ల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వేలోని ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించాల న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**పరిగి:** సమగ్ర సర్వేను సక్రమంగా చేపట్టాలని పరిగి మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో కరీం సూచించారు. ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సోమవారం పరిగిలోని మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రొఫార్మాను క్షుణ్ణంగా చదివి, ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు పొందుపరచాలని సూచించారు. ఇంటి యజమాని తెలిపిన వివరాలు నమోదు చేయాల్సిందిగా చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, కమిషనర్ వెంకటయ్య, ఎంఈవో గోపాల్ పాల్గొన్నారు.

**కొడంగల్:** ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టాల్సిన సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించే విధంగా సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఉషశ్రీ, తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల పరిధి, మున్సిపల్ పరిధి ఎన్యూమరేట్, సూపర్‌వైజర్లకు సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డితో పాటు ఉపాధ్యాయులు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్వేను ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు మండల ప్రత్యేకాధికారి సత్తార్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయుల శిక్షణ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల సమయంలో ఎట్టిపరిస్థితుల్లో సర్వే చేయడానికి అవకాశం లేదని, మధ్యాహ్నం తర్వాతనే ఉపాధ్యాయులు సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంఈవో వెంకటయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

**ధారూరు:** సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి మల్లేశం అన్నారు. సోమవారం ధారూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి నర్సింహులు ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లుగా నియామకమైన ఉపాధ్యాయులకు సమగ్ర సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో షఫీఎల్లా, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.



*తాండూరు: ఎన్యూమరేటర్ల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న*

**నవాబుపేట:** సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనురాధ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న 32 గ్రామాల్లో పదివేల ఎనిమిది వందల ఇరవై కుటుంబాలు ఉండగా సర్వే చేసేందుకు 77 మంది సిబ్బందిని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వీరికి సూపర్‌వైజర్ ఎనిమిది మంది ఉంటారని, ఒక సర్వేయరుకు 150 నుంచి 175 కుటుంబాలను సర్వే చేయాలనే ప్రభుత్వ నిబంధనగా పేర్కొన్నట్లు తెలిపారు. సర్వేను మండల స్పెషలాఫిసర్ పర్యవేక్షిస్తుంటారని సర్వే చేసిన వివరాలను వెనువెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరిచాలని గుర్తుజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ రహీమ్, మాస్టా ట్రైనర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మర్పల్లి :** సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో రాజమల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారావు, ఎంఈవో అంజిలయ్య, ఏపీఎం మధుకర్, ఏపీవో అంజిరెడ్డి, ఏవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఒంటిపై పెట్రోల్ పోసుకొని

## వ్యక్తి ఆత్మహత్య

కులకచర్ల, నవంబర్ 4 : ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కులకచర్ల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కులకచర్ల ఎస్ఐ అన్వేశ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుల కచర్ల గ్రామానికి చెందిన కొమ్ము విష్ణు(43) తన తల్లితో గొడవ పడుతున్న క్రమంలో అన్నదమ్ములు మల్లేశ్, మదరయ్య వచ్చి గొడవ పడ్డారు. ఈ విషయాన్ని అవ మానంగా భావించిన ఆయన ఆదివారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబసభ్యులు గమనించి మొదటగా కులకచర్ల ప్రభు త్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో గండీడ్ మండలం నుంచి 108 వాహ నాన్ని రప్పించుకున్నారు. 108లో అతన్ని మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన సోదరులతో గొడవ పడ టాన్ని అవమానంగా భావించి తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్యలక్ష్మి కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

యాలాల, నవంబర్ 4: రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాగాయిపల్లి నుంచి కమాల్‌పూర్, బాగాయిపల్లి నుంచి పగిడ్యాల్ వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వీలైనంత త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులు పూర్తి అయ్యేవరకు రోడ్డు మధ్యలో ఉన్న గుంతలను పూడ్చి వారికి కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే వారి కొరకు భద్రతా సూచీ బోర్డులను పెద్ద అక్షరాలతో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తమరావు, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, అమృతప్ప, చంద్రశేఖర్ గౌడ్, హనుమంతు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గం

కొడంగల్, నవంబర్ 4: పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరుతున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయడం దుర్మార్గపు చర్యగా బీసీ సెల్ మండల అధ్యక్షుడు రవిగౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని గత ఏడాది పాటు ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు వారి పాలనా కాలంలో అభివృద్ధి పనులు చేపట్టారని వాటికి బిల్లులు చెల్లించకపోవడం వల్ల మాజీ సర్పంచ్‌లు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. శాంతియుతంగా నిరసనకు పిలుపునిచ్చిన సర్పంచ్‌లను ఎందు అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిధుల విడుదలపై ఎందు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. అక్రమ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, త్వరలో బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



వికారాబాద్, నవంబర్ 4: యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా వాటికి దూ రంగా ఉండాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమ వారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెహ్రూ యువక కేంద్రం వారి ఆధ్వర్యంలో వికారాబాద్ మున్సి పల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన మాదక ద్రవ్యాల నివారణపై ఒక్కరోజు వర్క్ షాప్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డిఎస్పీ పుష్పన్, కమిషనర్ జాకీర్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్ నిఖిల్, డీవైవో, విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

## ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి




వికారాబాద్, నవంబర్ 4 : విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా విద్యుత్ కార్మికులు హెచ్ 82 సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో డీఈ టెక్నికల్ సూర్యనాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సబ్ స్టేషన్‌లో ఇద్దరు ఉన్న దగ్గర వెంటనే మూడవ ఆపరేటర్ నియమించాలన్నారు. పోల్ టు పోల్ ఆర్టిజన్స్ కార్మికుల పని భారం తగ్గించాలని వారు కోరారు. జిల్లాలో ఉన్న సబ్ స్టేషన్స్ అన్నింటిని మెయింటెనెన్స్ చేయాలన్నారు.

## పూల్‌సింగ్ నాయక్ కుటుంబానికి పరామర్శ



పెద్దేముల్, నవంబర్ 4 :మండల పరిధిలోని పాషాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పూల్ సింగ్ నాయక్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పాషాపూర్ గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చి ఆర్థిక సాయాన్ని అందించారు.ఆయన వెంట తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పి. లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్వంత్ రెడ్డి, మాజీ సర్పంచులు ప్రకాశం, భరత్‌కుమార్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, డీవై నర్సింహులు,దుగ్గాపూర్ శ్రీను, శ్రీనివాస్, రాములు నాయక్, తులసీరాం, మోహిద్, పాషాపూర్ నాయకులు పాల్గొన్నారు.



పరిగి, నవంబర్ 4 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీఏసీఎస్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డిని సోమవారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అందుతున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దామోదర్‌రెడ్డిని పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకటయ్య ఉన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం..



కొడంగల్, నవంబర్ 4: దుద్యాల మండలంలోని ఆలేడ్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళుతున్న, నూతనంగా పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మాజీ సభ్యులు ముక్తార్, మాజీ సర్పంచ్ విజయమ్మ, రాములుతో పాటు పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## సాధికారితపై విద్యార్థులకు అవగాహన



ధారూరు, నవంబర్ 4: మహిళలు సాధికారిత ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికార బృందం జిల్లా సభ్యురాలు వరలక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కుక్కింద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళా సాధికారత కేం ద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివా హ నిరోధక చట్టం, మహిళాహెల్ప్ లైన్ 181 గురించి,చిల్డ్రన్ హెల్ప్‌లైన్ 198 గురించి వివ రించారు. మహిళా సాధికారత బృందంలోని ఫైనాన్షియల్ లిటరసీ రాందాస్ మాట్లాడుతూ సఖీ కేంద్రం ఐదు రకాల సర్వీసులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. హెల్ప్ లైన్ నెంబర్ 100, 1098, 181, 14567, ఏ విధంగా ఉపయోగపడుతాయో వివరించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ రామ్‌దాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.